

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - రెండవ కథ -

కొన్నేళ్ళ క్రితం ,

మాఘ మాసం , పెళ్ళిళ్ళ సీజన్. నా టేబిల్ మీద ఉన్న కేలండర్లో, ఆ నెల గళ్ళన్నీ లంచ్ లు, డిన్నర్లతో నిండిపోయి ఉన్నాయి. వాటన్నింటికీ సరిగ్గా హాజరైతే, మా వంటావిడను ఉత్తర భారత దేశపు యాత్రకు పంపించొచ్చు.

ఆ రోజు ఉదయం ఏడు గంటలకు తెలిసిన వాళ్ళపెళ్ళి. మధ్యాహ్నం పెళ్ళి తాలూకు లంచ్. పొద్దున్నే బ్రేక్ ఫాస్ట్ కు వెళ్తే, చక్కగా పెళ్ళికి హాజరైనట్లూ ఉంటుంది. లంచ్ తప్పించు కుని , హాయిగా హాస్పిటల్ పని చేసుకోవచ్చు అని ఓ పథకం ప్రకారం రెడీ అవుతున్నాను.

పట్టు చీర మీదకు ముత్యాలైతే బాగుంటుందా, బంగారం సూటవుతుందా అని ఆలోచనలో ఉండగా, ఆయమ్మ వచ్చింది.

" అమ్మా, పేషంట్లొచ్చారు."

ఇప్పుడా అనబోయి, " ఎవరూ?" అన్నాను.

"ఎవరో అమ్మాయి. "

"పెద్ద వొయసేంగాదు, ఆయమ్మాయి, ఆళ్ళమ్మా ఒచ్చారు. కడుపులో నొప్పి అంట" . మళ్ళీ ఆయమ్మే అంది

ప్రతినెలా వచ్చే నొప్పి అయ్యుంటుంది. ఓ ఇంజెక్షన్ ఇచ్చేసి, కాసేపు చూసుకుని, ఓ అరగంటలో పెళ్ళికెళ్ళొచ్చు. అని కిందకు వెళ్ళి చూస్తే---

ఓ అమ్మాయి వెయిటింగ్ రూం లో మెలికలు తిరుగుతోంది. మొహమంతా పాలిపోయి ఉంది.

నెలనెలా వచ్చే నొప్పికాదనిపించింది.

"బ్లీడింగ్ అవుతోందా?" అడిగాను.

" కొద్దిగా" అంది పక్కనున్నావిడ.

కొద్దిగా కాదనీ, ఎక్కువేననీ తెల్లని బెడ్ షీట్ చెప్తోంది.

గబగబా లోపలికి తీసుకెళ్ళి ఎగ్జామినేషన్ టేబిల్ మీద పడుకోబెట్టి చూస్తే, పొత్తికడుపు కొద్దిగాఎత్తుగా ఉంది.

పరీక్ష స్కానింగ్ చేసి చూస్తే , పొట్టలోపలి నుండి ఒక చిన్న జీవి నెలలు నిండకుండానే బయటపడడానికి ప్రయత్నం చేస్తోంది. మార్గమధ్యంలో ఇరుక్కుపోయింది. అందుకే నొప్పి--- బ్లీడింగ్. వెంటనే ఆ ప్రాణిని బయటకు సాగనంపితే గానీ ఆమెకు బ్లీడింగ్ , నొప్పి తగ్గదు. అలాంటపుడు డాక్టర్లు సహాయం చేయాల్సొస్తుంది.

"వెంటనే ఆ డ్రెస్ మార్చండి. ఐవి లైన్ పెట్టి, థియేటర్ రెడీ చెయ్యండి." అని మా వాళ్ళతో చెప్పాను. . టైట్ గా ఉన్న చూడిదార్ నుండి ఆమెను హాస్పిటల్ గౌన్ లోకి మార్చడానికి స్టాఫ్ తంటాలు పడుతున్నారు.

ఇంతలో ఆమె బంధువులకు విషయం చెప్పి, ఆపరేషన్ అనుమతి పత్రాల మీద సంతకాలు తీసుకుందామని బయటికి వచ్చాను. ఆ అమ్మాయితో వచ్చినావిడ ఎక్కడుందోనని చూస్తే , రిసెప్షన్ లో ఉన్న కుర్చీలో కూర్చుని బయట వెళ్ళే పోయే వాహనాలను గమనిస్తోంది. వెనకనుండి చూస్తే పెద్ద బన్ ముడి.

నేనొచ్చిన విషయం గమనించినట్లే లేదు.

నాతో పాటు వచ్చిన నర్సు ఆమెను తట్టి " మేడం " అని చెప్పింది. ఆవిడ మౌనంగా లేచి నిల్చుంది.

ఇస్త్రీ చేసిన కాటన్ చీర నడుముచుట్టూ తిప్పి కుడిచేత్తో పట్టుకుని ఉంది. ఎడమచేతిలో పొడుగాటి పర్సు. నుదిటన పెద్ద సైజు ఎర్రటి స్టిక్కర్.

"అమ్మాయి మీకేమవుతుంది?"

"మా అమ్మాయే."

ఆవిడలో ఏమాత్రం ఆందోళన లేకపోవడం విచిత్రంగా ఉంది.

"వాళ్ళ హజ్బెండ్ వచ్చాడా?"

రాలేదని అడ్డంగా తలూపింది.

" అమ్మాయికి అబార్షన్ అవుతోంది. బ్లీడింగ్ కంట్రోల్ కావాలంటే త్వరగా క్లీన్ చెయ్యాలి."

ఆమె వివరాలేమీ అడగకపోయినా, చేయబోయే ప్రొసీజర్ గురించిన వివరాలు గబగబా ఆమెకు చెప్పాను. మాట్లాడకుండా అడిగిన చోట సంతకం పెట్టింది.

ఆ అమ్మాయిని థియేటర్లో పడుకోబెట్టి, మత్తు ఇచ్చి, గర్భాశయాన్ని క్లీన్ చేసే సరికి ఓ అరగంట పట్టింది. అంతా సెటిల్ అయిందికాకపోతే కాస్త మత్తులో ఉంది. ఓపీలో మిగతా కేసులు చూసుకొని ఆ పనీ ఈ పనీ చేసే సరికి మధ్యాహ్నం మూడైంది. పొద్దున్న బ్రేక్ ఫాస్ట్ కు వెళ్దామనుకున్న దాన్ని ,పెళ్ళి లంచ్ కు వెళ్ళాను. నన్ను కల్యాణమండపం లో దింపేసి , పిల్లల్ని తీసుకురావడానికి స్కూలుకెళ్ళాడు డ్రైవర్.

డాక్టర్లు చాలా మంది వచ్చారు.

డా. మధుసూదనంగారు, భార్యతో కలిసి వచ్చారు.

మనిషిని చూడగానే ఈయన డాక్టర్ అయ్యుంటాడని అనిపించే ఆ తరం సీనియర్ డాక్టర్.

చాలా ఏళ్ళ ప్రాక్టీసు తర్వాత, ప్రస్తుతం ఉచితంగా సర్వీస్ చేస్తున్నారు. ఎక్కడ కనిపించినా ఎంతో అభిమానంగా పలకరిస్తారు. వాళ్ళ బంధువుల్లో ఆడవాళ్ళు కొంతమంది నాదగ్గరకు ట్రీట్ మెంట్ కోసం వస్తుంటారు . ఎంత వయసయినా సరే, పొట్ట పెరగనీయరు. గడ్డం మాయనీయరు. చక్కగా దువ్విన తెల్లని జుట్టు. ఇస్త్రీ మడతలు నలగని బట్టలు. టక్ చేసిన లేత రంగు ఫుల్ హేండ్స్ షర్ట్. తళతళలాడే బూట్లు. తెల్లని చేతులు.

నేను డ్రైవర్ కోసం ఎదురు చూస్తుంటే , భార్యా భర్తలిద్దరూ దగ్గరకొచ్చి పలకరించి మాట్లాడారు. తాము దింపేస్తామని వాళ్ళకార్లో ఎక్కించుకున్నారు. .

దార్లో వాళ్ళింటి దగ్గర ఆపి, టీ తాగి వెళ్ళమని లోపలికి తీసుకెళ్ళారు. మాటలమధ్యలో వచ్చేవారం తమ్ముడి పెళ్ళి అనీ, నేను తప్పకుండా రావాలనీ ఆమె చెప్పారు.

ఆయనకు పిల్లల్లేరు. భార్య తమ్ముడినే స్వంత కొడుకులా చూసుకుని , చదివించారు.

ఆ అబ్బాయికే పెళ్ళి.

కూర్చోబెట్టి మంచి కాఫీ ఇచ్చి , ఆవిడ చెప్తోంది.

" మా విశ్వం మీకు తెలుసుగా. ఇప్పుడు అమెరికాలో కార్డియాలజిస్ట్. రెండేళ్ళ తర్వాత ఇండియాకు వస్తున్నాడు. పిల్లను చూసే బాధ్యత మామీదే పెట్టాడు.కట్నం వద్దు, అందగత్తె అక్కర్లేదు. . పెద్దవయసులో మమ్మల్ని కాస్త కనిపెట్టుకునేందుకు ఒప్పుకునే అమ్మాయి కావాలన్నాడు. అలాగే దొరికింది. చక్కటి పిల్ల. వదినా వదినా అంటూ బాగా కలిసిపోతుంది. ఈ రోజుల్లో అలాంటి అమ్మాయి దొరకడం ఎంతో కష్టం."

తమ్ముడి భార్యకు తను పెట్టబోయే నగల్నీ, పట్టుచీరలూ అవీ చూపెట్టారు. ఎంతో ఓపికగా షాపింగ్ చేసినట్లు తెలుస్తోంది. తమ్ముడిమీద అభిమానంతా ఆమె సెలెక్ట్ చేసిన వస్తువుల్లో కనిపిస్తోంది. పెళ్ళి పిలుపులకు తొందర్లోనే వస్తామనీ, పెళ్ళికి తప్పకుండా రావాల్నీ మరీ మరీ చెప్పారు.

★★★★★★

వాళ్ళింటినుండి హాస్పిటల్ కు వచ్చేసరికి పొద్దుటి అబార్షన్ పేషంటూ, ఆమె తల్లీ అన్నీ సర్దుకుని బయట కూర్చుని ఉన్నారు.

"వెళ్తారంట మేడం" చెప్పింది నర్సు.

"ఏంటంత తొందర?"

"వెళ్ళాలి." ముక్తసరిగా అంది తల్లి. ఆమె విచిత్రమైన ధోరణికి కాస్త ఆశ్చర్యం వేసినా "కనీసం ఒక్కరోజు అబ్జర్వేషన్ లో ఉంచండి. ఏదైనా ప్రాబ్లెం అయితే హడావుడిగా రావడమెందుకు."

" కుదరదు మేడం."

ఏవైనా మాట్లాడితే నాలుగు తిట్టొచ్చు. అసలేమీ మాట్లాడని ఆ పేషంట్ ని, ఆమె తల్లినీ ఏమనాలో తోచలేదు. నేను ఎంత చెప్పినా నిర్లక్ష్యంగా ఎటో చూస్తూ ఉంది తల్లి. ఎంత సేపూ చేతిలో చీరకొంగూ, ఇంకో చేతిలో పర్సూ, పెద్ద బన్ను ముడీ .

బిల్లు కట్టేస్తామంది. .

వళ్ళు మండి 'బిల్లూ లేదూ బల్ల లేదు, పోండవతలకు' అని తిట్టాలనిపించినా, మాట్లాడకుండా లోపలికొచ్చి వాడాల్సిన మందుల ప్రిస్క్రిప్షన్ రాస్తుంటే నర్సొచ్చి డబ్బు టేబిల్ మీద పెట్టింది.

"వీళ్ళకు బిల్లెవరు వేశారు?" అన్నాను.

"వాళ్ళే ఇచ్చి వెళ్ళారమ్మా"

"వెళ్ళడమేంటీ, వాడాల్సిన మందులు తీసుకోవాలికదా. ఈ ప్రిస్క్రిప్షన్ ఇవ్వు." అన్నాను.

మరి మందులు ఎలా వేసుకోవాలో చెప్తానని నర్సువెంటబడ్డా ఆటో ఎక్కి వెళ్ళిపోయారు. ఫైలు ఇక్కడే వొదిలేసి పోయారట.

వాళ్ళ వింత ప్రవర్తన వింతగా ఉండి ఆఫైల్ తీసుకురమ్మన్నాను. ఎందుకైనా మంచిదని, కబ్ బోర్డ్ లో ముఖ్యమైన ఫైల్స్ పక్కన పెడుతూ పేరు చూశాను.

'విజయ.'

ఆ రోజు రిజిస్టర్ లో కేసు వివరాలు జాగ్రత్తగా రాసుకున్నాను.

★★★★★★★

వారం తర్వాత డా. మధుసూదనం గారు, ఆయన భార్యా పెళ్ళికి పిలవడానికి వచ్చారు.

"ఎప్పటిలా ఏదో సాకు చెప్పి తప్పించుకోకండి. మా తమ్ముడి పెళ్ళి. మీరు వ్రతానిక్కూడా రావాలని బంగారు కుంకుమ భరిణలోంచి కుంకుమ తీసి బొట్టు పెట్టి, ముక్కు మీదరాలిన కుంకుమ తన కర్చీఫ్ తో తుడిచి,చాలా అభిమానంగా చెప్పి వెళ్ళారు.

ప్రతి పెళ్ళికీ కరెక్ట్ గా ముహూర్తం టైముకు అటూ ఇటూగా వెళ్ళడం, ఒకరి నెత్తి మీద , ఒకరు చెయ్యిపెట్టుకుని అక్షింతలు వేసే వాళ్ల క్యూ ఎప్పటికయ్యేనో అని నిస్పృహలో ఉన్న పెళ్ళికొడుకూ పెళ్ళికూతురి తలల మీద అక్షింతలెయ్యడం, వచ్చేయడం.

ఒకటా రెండా? నెలమొత్తం ఎన్నో పెళ్ళిళ్ళు. మధుసూదనంగారి బావమరిది పెళ్ళిక్కూడా వెళ్ళాను. అందరిపెళ్ళిళ్ళలోనూ ఒకే రకం పనసకాయ బిరియానీ, పచ్చిపులుసు స్పెషల్ గా వండించారు. ఒక్క పెళ్ళిజంట మొహాలు కూడా సరిగా చూసిందిలేదు.

మా వూళ్ళో డాక్టర్ల పిల్లల పెళ్ళిళ్ళన్నీ ఒకే దాదాపు ఒకే కల్యాణమండపంలో పెళ్ళి చేస్తారు.

ఆ నెల పెళ్ళిళ్ళన్నీ అయిపోయాయి. నెల రోజుల పాటు ఒకే వెన్యూ లో ఒకే మెనూ తినీ తినీ విరక్తి వచ్చేసింది.

వేడి వేడి అన్నంలో చింతకాయ పచ్చడి వేసుకుని తింటే గానీ , పనసకాయ పైత్యం తగ్గలేదు.

★★★★★★★★

కొన్నాళ్లకు డా. మధుసూదనం గారి దగ్గర్నుండి ఫోన్ వచ్చింది.

"ఏం లేదమ్మా, ఓ విషయం మాట్లాడాలి." అన్నారు.

"చెప్పండి సార్."

"నేను ..కొద్దిగా...."

మాట్లాడేందుకు సందేహిస్తున్నారు.

"మా వైఫ్ తో మాట్లాడతారా?"

మీరు వెళ్ళండి అని ఆమె గొంతు వినిపించింది. ఆ పైన తలుపు వేసిన శబ్దం.

"డాక్టర్ గారూ, చిన్న అనుమానం, ఆడవారికి బిడ్డపుడితేనే కదమ్మా పాలు పడేది."

"అవుననుకోండి. ఎందుకొచ్చింది ఈ అనుమానం."

“నిన్న, కొత్త పెళ్ళికూతురుని చూసేందుకు మా చుట్టాలొచ్చారు. చుట్టాల్లో పిల్ల తల్లి, ఒకామె ఉంది. ఆమె బిడ్డకు పాలు పడుతుంటే ఉన్నట్టుండి పెళ్ళికూతురు లోపలికెళ్ళిపోయింది. పిలవడానికని నేను లోపలికెళ్ళి చూస్తే , ఆమె చూడీదార్ అంతా పాలతో తడిసిపోయి ఉంది. ప్రసవం కాకుండా అలా పాలు పడే అవకాశం ఉంటుందా అని అడగుదామని.”

కొద్ది సేపు ఆలోచించాను.

పాలు ఉత్పత్తి అయే సందర్భాలు గుర్తొచ్చాయి.

గర్భం దాల్చడం (కొద్దిమందిలో ),

గర్భ స్రావం కావడం,

కాన్పు తర్వాత,

థైరాయిడ్ గ్రంధి సరిగా పనిచెయ్యకపోవడం,

పిట్యూటరీ గ్రంధి ట్యూమర్లు,

పి సి ఒ డి,

ప్రొలాక్టిన్ హార్మోన్ ఎక్కువకావడం

కారణాలన్నింటినీ మనసు రివైజ్ చేస్తోంది.

ఆమెతో అవన్నీ చర్చించకుండా " పాలు రావడానికి ఎన్నో కారణాలుంటాయండీ. బిడ్డ పుట్టడమొక్కటే కాదు. ఓ సారి అమ్మాయిని తీసుకురండి. చూస్తాను.”

“ హాస్పిటల్ అంటే ఆ అమ్మాయి ఇష్టపడడం లేదమ్మా. అదేకాదమ్మా, ఆ అమ్మాయి ఎప్పుడూ బాత్ రూం లో తలుపేసుకుని ఎవరితోనో ఎప్పుడు మాట్లాడుతోందట. ఈ విషయం విశ్వం కూడా గమనించి అమ్మాయిని నిలదీస్తే , పెళ్ళైన పదిరోజులకే అనుమానపడి అవమానిస్తున్నారని టీవీ చానల్ కు ఫోన్ చేస్తాననీ, హెచ్ ఆర్ సీ కి వెళ్తానని బెదిరించిందట.”

“అలాగా” అన్నాను ఏం చెప్పాలో తెలియక.

“పోనీ రేపాదివారం వాళ్ళిద్దర్నీ ఓ సారి మా ఇంటికి పంపించండి.”

“ వాడు మనసు కష్ట పెట్టుకుని, దిగులుతో అమెరికా వెళ్ళిపోయాడమ్మా. ఇప్పుడేం చెయ్యాలో తోచడం లేదు. తనని అమెరికా పంపించకపోతే మా మీద కేసు పెడతానంటోంది. డాక్టర్ గారికిలాంటివి అలవాటు లేక బెదిరిపోతున్నారు.”

★★★★★★★★★

రెండు రోజుల తర్వాత బ్రేక్ ఫాస్ట్ చేస్తూ అలవాటుగా టీవీ పెట్టాను.

నల్లకోటు వేసుకుని, ఎర్రటై కట్టుకున్న టీవీ యాంకర్ అటూ ఇటూ పచార్లు చేస్తూ, చేతులూపుతూ చెప్తున్నాడు.

“ ఆమె పేరు స్వాతి. విద్యాధికుడైన డాక్టర్ ను చేసుకుంటే తన జీవితం బాగుంటుందని కోటి ఆశలతో పెళ్ళి పల్లకీ ఎక్కింది. కానీ తను ఎక్కింది ముత్యాల పల్లకీ కాదు, ముదనష్టపు పాడె అనీ, స్వాతిచినుకు లాంటి తన జీవితం ముత్యపు చిప్పలో పడబోయి, మురుగ్గుంటలో పడిందనీ తెలుసు కోవడానికి, ఆమెకు ఎంతోకాలం పట్టలేదు.

ఎన్నారై సంబంధాల మోజులో తల్లి దండ్రులు, అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురు విదేశాల్లో సుఖపడుతుందనీ, శక్తికి మించిన అప్పులు చేసి , లక్షలకు లక్షల కట్నం ధారపోసి పెళ్ళిళ్ళు చేస్తున్నారు. జీవితాంతం తోడుంటానన్న చేసిన బాసలు మరచి, పెళ్ళికొడుకులు ఫ్లైట్ ఎక్కేస్తున్నారు. ఇండియాలో ఉన్న అత్తమావల కట్న దాహానికి   అమాయకురాళ్ళైన ఆడపిల్లలు బలవుతున్నారు. కట్న పిశాచి కోరల్లో చిక్కుకుని అభాగ్యులైన అబలలు గిలగిలలాడుతున్నారు. దీనికి అంతం లేదా? నిండు సమాజం నిద్ర పోతోందా, ప్రభుత్వం పట్టించుకోదా?

వివరాల్లోకి వెళ్తే,

డాక్టర్ మధుసూదనం కు పిల్లల్లేరు. బావమరిదైన విశ్వం ను చేరదీసి పెంచి పెద్దచేశాడు . డాక్టర్  విద్య చదివించి అమెరికా సైతం పంపించాడు.

డా. విశ్వం పై తను పెట్టిన పెట్టుబడి తిరిగి పొందే ప్రయత్నంలో , పెళ్ళి ఆశపెట్టి , స్వాతి తల్లిదండ్రుల దగ్గర్నుంచి పదిలక్షలవరకూ కట్నం గుంజాడు. వంద సవర్ల బంగారం, లాంఛనాలు, ఆడబడుచు కట్నాలు అన్నీ కలిసి ఆ మధ్య తరగతి కుటుంబానికి తడిసి మోపెడయ్యాయి.  కూతురు అమెరికాలో సుఖపడుతున్న ఒకే ఒక కారణంతో వారి కట్న దాహం తీర్చడానికి సిద్ధపడ్డారు ఆ తల్లిదండ్రులు. పెళ్ళి తర్వాత , అమాయకురాలైన స్వాతి మీద లేనిపోని అభాండాలు వేసి,  భర్త అయిన డా. విశ్వం  మనసు విరిచేసి అమెరికా పంపేశారు.

పవిత్రమైన వృత్తిలో ఉంటూ , సమాజంలో అందరికీ ఆదర్శప్రాయంగా మెలగ వలసిన ఈ  వయసుమళ్ళిన వైద్యుడే ఆమె పాలిట యముడై దాపురించాడు. ముచ్చటైన కొత్త జంట జీవితంలో మంట పెట్టాడు. వారిద్దరి వివాహంబంధాన్ని విచ్ఛిన్నం చేసే దారుణానికి వొడిగట్టాడు. పెళ్ళయి నెలగడవకముందే, కాళ్ళ  పారాణి ఆరకముందే,

, ఏడడుగుల గుర్తులు మాయక ముందే వారిద్దర్నీ విడదీసేందుకు సైతం వెనుదీయలేదు ఆ నీచుడు. అన్యోన్యంగా సాగే వాళ్ళకాపురంలో చిచ్చుపెట్టి, వైద్యవృత్తికే మాయని మచ్చతెచ్చాడు. ఇప్పుడు  మరింత కట్నమిచ్చే ఇంకో సంబంధం కోసం గోతి కాడ నక్కల వలె ఎదురుచూస్తున్నారు అంటూ డా. మధుసూదనం గారినీ , ఆయన భార్యనూ మళ్ళీ, మళ్ళీ  చూపిస్తున్నారు.

కొత్తపెళ్ళికొడుకైన డా. విశ్వం నవ్వుతున్న ఫోటో ఒకటి చూపిస్తూ " కట్టుకున్న భార్యను కన్నీటికి అంకితం చేసి అమెరికాకు  పైలా పచ్చీసుగా చెక్కేశాడు గుండెలేని ఈ కార్డియాలజిస్ట్. గుండె జబ్బులు నయం చెయ్యాల్సిన డాక్టర్, తన స్వంత భార్య గుండెకే మాయని గాయం చేశాడు.  భర్తకు దూరమైన స్వాతి , సీతగా మారి అగ్నిప్రవేశానికి సిద్ధపడింది.

" పెళ్ళైన తర్వాత ఆయన  నన్ను ఎంతో ప్రేమగా చూసుకున్నారండీ. వాళ్ళ అక్కా బావా నామీద చాడీలు చెప్పి ఆయన్ను నాక్కాకుండా చేస్తున్నారు. అమెరికా వెళ్ళినప్పటినుండీ  ఆయన నాతో మాట్లాడడలేదు. నన్ను ఆయన దగ్గరకెళ్ళనీయకుండా ఈయనా, ఈయన భార్య అడ్డుపడుతున్నారండీ.   ఇప్పుడు నేను బ్రతికి ప్రయోజనం ఏముంది. అందుకని వాళ్ళింటి ముందే ఆత్మహత్య చేసుకుంటాను" అంటూ , అయిదులీటర్ల ప్లాస్టిక్ డబ్బా మూత విప్పడానికి ప్రయత్నిస్తుంటే , హేండ్ బేగులు ధరించిన మహిళా సంఘాలవాళ్ళు ఆమెను ఆపడానికి పోటీపడుతున్నారు.

ఆ అమ్మాయి ...ఆ అమ్మాయి...

కళ్ళముందు కూతురి బ్రతుకు కాలిపోతుంటే , కన్నీరు మున్నీరవుతున్న తల్లితో మాట్లాడదాం అంటూ మైక్ తీసుకెళ్ళి ఒకావిడ మొహం మీద పెడుతున్నారు. కంగారులో టీవీ  సౌండ్ పెంచేస్తున్నాను.

మా అమ్మాయి లోపల్నుండి పరుగెత్తుకొచ్చి "రేపు ఎగ్జాం అమ్మా , ప్లీజ్, "  అంటూ టీవీ మ్యూట్ లో పెట్టి వెళ్ళింది.

తల్లీ కూతుళ్ళను ఒకే ఫ్రేములో చూసి అదిరిపోయాను. తల్లి ని వెంటనే గుర్తు పట్టాను. ఆమె ...ఆమే. అదేనండీ! బన్నుముడి... కూల్ తల్లి.

వాళ్ళు ..వాళ్ళే, ఆరోజు అబార్షన్ అయిన అమ్మాయిల , ఆమె తల్లి.

ఆ అమ్మాయి పేరు స్వాతి కాదే..ఏదో ఉంది.

టీవీలో ఇంకో పక్క మధుసూదనం గారు మాసిన గడ్డంతో ఉన్నారు. టీవీల వాళ్ళు అడిగే ప్రశ్నలకు ఏం జవాబు చెప్పలేక తలదించుకుంటున్నారు.

ఇదేమిటి?

వెంటనే హాస్పిటల్ కు వెళ్ళి కప్ బోర్డ్ లో ఉన్న ఫైల్ తీసి చూశాను. ఫైల్ మీద 'విజయ' అని ఉంది. అంటే... పేరు మార్చి చెప్పారన్న మాట.

ఆలోచిస్తుంటే వాళ్ళు వదిలేసి వెళ్ళిన ప్రిస్క్రిప్షన్ కాగితం ఫాను గాలికి రెపరెపలాడుతోంది.

అందులో టాబ్. కాబర్ గోలిన్ అని వ్రాసి ఉంది. పాలు పడకుండా ఆపేసే మందు.

★ సూచన: 'తర్వాత ఏమైంది, డాక్టర్ మధుసూదనం గారు ప్రస్తుతం ఎక్కడున్నారు ' ఇత్యాది ప్రశ్నలకు సమాధానాలు, కోర్టు బయట కోటిరూపాయలకు దొరుకును.

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments